తెలంగాణ పతక జోరు

నేషనల్ గేమ్స్

పనాజీ: గోవా వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. మహిళల 200మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో యువ స్విమ్మర్ ప్రితి అగర్వాల్ కాంస్య పతకంతో మెరిసింది. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన రేసులో ఆస్తా చౌదరీ(2:19:29సె, అస్సాం), హషికా రామచంద్ర(2:22:20సె, కర్నాటక) వరుసగా స్వర్ణ, రజతాలు కైవసం చేసుకోగా, 2:22:28 టైమింగ్‌తో ప్రితి మూడో స్థానంలో నిలిచింది. నేషనల్ గేమ్స్‌లో ప్రితికి ఇది మూడో పతకం. మరోవైపు శ్రీవల్లి రష్మిక, శ్రావ్య శివానీ, అభ్యా , సౌమ్య, అపూర్వతో కూడిన తెలంగాణ మహిళల టెన్నిస్ జట్టు కాంస్య పతకం సొంతం చేసుకుంది. మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో రష్మిక, శివానీ జోడీ 7-6(6), 3-3తో అంకితా రైనా, వైదేహి చౌదరీ ద్వయంపై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించింది. ఓవరాల్‌గా ఇప్పటి వరకు తెలంగాణ 12 పతకాలతో 22వ స్థానంలో కొనసాగుతున్నది.

సెమీస్ లక్ష్యంగా..

శ్రీలంకతో టీమ్ ఇండియా పోరు నేడు

ఫామ్‌మీదున్న రోహిత్‌సేన

ముంబై: మెగాటోర్నీలో భారత్ వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. సొంతగడ్డపై ఎలాగైనా కప్ ఒడిసిపట్టుకోవాలన్న కసితో ఉన్న టీమ్‌ఇండియా అందుకు తగ్గట్లు ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తూ ముందుకు సాగుతున్నది. ఆస్ట్రేలియాతో మొదలైన రోహిత్‌సేన విజయపరంపర ఆ తర్వాత అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఇంగ్లండ్..ఇలా అందరి భరతం పడుతున్నది. మరోవైపు లంకేయుల కథ ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నది. కీలక ప్లేయర్లు గాయాలతో టోర్నీకి దూరమైతే..ఉన్న వాళ్లు స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించడంలో విఫలమవుతున్నారు. ఫలితంగా అనూహ్య ఓటములు చవిచూస్తున్నది. గత మ్యాచ్‌లో పసికూన అఫ్గానిస్థాన్ చేతిలో ఓటమి ఇందుకు నిదర్శనం. పరుగుల వరదకు చిరునామా అయిన వాంఖడే స్టేడియంలో భారత్‌కు కనీసం పోటీనివ్వాలన్న పట్టుదలతో లంకేయులు బరిలోకి దిగే అవకాశముంది.

మార్పుల్లేకుండానే:

లంకతో మ్యాచ్‌లో భారత్ ఎలాంటి మార్పుల్లేకుండానే బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రయోగాల జోలికి పోకుండా విన్నింగ్ కాంబినేషన్ కొనసాగించేందుకు మేనేజ్‌మెంట్ మొగ్గుచూపవచ్చు. గాయపడ్డ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పూర్తిగా కోలుకోకపోవడంతో మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్‌ను కొనసాగించనున్నారు. రోహిత్ శర్మ, విరాట్‌కోహ్లీ సూపర్‌ఫామ్ మీద ఉండటం టీమ్‌ఇండియాకు కలిసిరానుంది. వీరిద్దరు బ్యాట్లు ఝుళిపిస్తే ముంబైలో పరుగుల వరద ఖాయం కానుంది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ నిలకడలేమి ఇబ్బందిగా మారినా.. ఒక్కసారి టచ్‌లోకి వస్తే ప్రత్యర్థికి ఇబ్బందులు తప్పకపోవచ్చు. మిడిలార్డర్‌లో భారీ అంచనాలు పెట్టుకున్న శ్రేయాస్ అయ్యర్ ఘోరంగా విఫలమవుతున్నాడు. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో 33.50 సగటుతో134 పరుగులకే పరిమితమయ్యాడు. బౌలింగ్ విషయానికొస్తే.. షమీ, బుమ్రా సూపర్ ఫామ్‌మీదున్నారు. వీరిద్దరు ఇదే జోరు కొనసాగిస్తే..లంక బ్యాటర్లకు పట్టుపగలే చుక్కలు ఖాయం. వీరికి కుల్దీప్‌యాదవ్, జడేజా జతకలిస్తే భారత్‌కు ఎదురుండకపోవచ్చు.

జట్ల అంచనా

భారత్: రోహిత్(కెప్టెన్), గిల్, కోహ్లీ, అయ్యర్, రాహుల్, సూర్యకుమార్, జడేజా, కుల్దీప్, షమీ, బుమ్రా, సిరాజ్

శ్రీలంక: కుశాల్ మెండిస్(కెప్టెన్), నిస్సనక, కరుణరత్నె, సమరవిక్రమ, చరిత అసలంక, మాథ్యూస్, వెల్లాలగె/డిసిల్వా, రజిత, తీక్షణ, మదుశనక, చమీర.

1 వన్డేల్లో సచిన్ టెండుల్కర్ సెంచరీల(49) రికార్డును అందుకోవడానికి విరాట్ కోహ్లీ (48) సెంచరీ దూరంలో ఉన్నాడు.

వాంఖడే స్టేడియంలో సచిన్ విగ్రహం

ముంబై : క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ విగ్రహాన్ని చారిత్రక వాంఖడే స్టేడియంలో ప్రతిష్ఠించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి సచిన్ తన భార్య అంజలి, కూతురు సారాతో కలిసి హాజరయ్యాడు. ఈ సందర్భంగా వాంఖడే స్టేడియంతో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నాడు. పదేళ్ల ప్రాయంలో తొలిసారి వాంఖడే స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు వచ్చానని, తన స్నేహితులతో కలిసి నార్త్ స్టాండ్‌లో కూర్చుని సందడి చేసేవారమని గుర్తుచేశాడు. ధోనీని కెప్టెన్‌గా చేయాలని ఇక్కడే సూచించానన్నాడు. ఈ కార్యక్రమానికి బీసీసీఐ కార్యదర్శి జై షా, కోశాధికారి ఆషిష్ శెలార్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శరద్ పవార్, తదితరులు హాజరయ్యారు.

ఐశ్వరి తోమర్‌కు స్వర్ణం

న్యూఢిల్లీ : ఆసియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల హవా కొనసాగుతున్నది. బుధవారం జరిగిన పురుషుల 50మీ. రైఫిల్3 పొజిషన్ విభాగంలో ఐశ్వరి స్వర్ణం సాధించాడు. ఫైనల్లో తోమర్ 463.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. ఇదిలా ఉంటే తెలంగాణ యువ షూటర్ ధనుశ్ శ్రీకాంత్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో పోటీకి దిగిన ధనుశ్ వేసుకున్న జాకెట్ నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో అనర్హత వేటు వేస్తున్నట్లు రిఫరీలు ప్రకటించారు. దీంతో పతకం గెలిచే అవకాశాన్ని కోల్పోయాడు.

కివీస్ సఫా

ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తమ దేశ రగ్బీ జట్టును స్ఫూర్తిగా తీసుకున్న దక్షిణాఫ్రికా మెగాటోర్నీలో దుమ్మురేపుతున్నది. న్యూజిలాండ్‌ను మట్టికరిపిస్తూ సెమీస్ రేసులో టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. డస్సెన్, డికాక్ సెంచరీలతో పుణెలో మోత మోగించిన సఫారీలు..కివీస్‌ను సఫా చేశారు. వీరిద్దరు చెలరేగడంతో భారీ స్కోరు అందుకున్న దక్షిణాఫ్రికా..బౌలింగ్‌లోనూ చెలరేగి కివీస్‌కు హ్యాట్రిక్ ఓటమి కట్టబెట్టారు.

డస్సెన్, డికాక్ సెంచరీల మోత

దక్షిణాఫ్రికా ఘన విజయం

పుణె: దక్షిణాఫ్రికాకు తొలుత బ్యాటింగ్ చేసే అవకాశమిస్తే..పూనకం వచ్చినట్లు చెలరేగుతారని తెలిసినా..న్యూజిలాండ్ అదే పనిచేసి చేతులు కాల్చుకుంది. బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 190 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత డస్సెన్(172 బంతుల్లో 133, 9ఫోర్లు, 5సిక్స్‌లు), డికాక్(116 బంతుల్లో 114, 10ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలతో దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 357/4 భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ బవుమా(24) నిరాశపరిచినా..డికాక్, డస్సెన్ వీరవిహారం చేశారు. మెగాటోర్నీలో డికాక్‌కు ఇది నాలుగో సెంచరీ కాగా, డస్సెన్‌కు రెండోది. ఆఖర్లో మిల్లర్(53)హార్డ్‌హిట్టింగ్‌తో దక్షిణాఫ్రికా 350 మార్క్ అందుకుంది. సౌథీ(2/77) ఫర్వాలేదనిపించాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనలో కివీస్..35.3 ఓవర్లలో 167 పరుగులకే కుప్పకూలింది. కేశవ్ మహారాజ్(4/46), జాన్సెన్(3/31) ధాటికి కివీస్ బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. గ్లెన్ ఫిలిప్స్(60) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 357/4(డస్సెన్ 133, డికాక్ 114, సౌథీ 2/77, బౌల్ట్ 1/49), **న్యూజిలాండ్:** 35.3 ఓవర్లలో 167 ఆలౌట్(ఫిలిప్స్ 60, యంగ్ 33, మహారాజ్ 4/46, జాన్సెన్ 3/31)

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
దక్షిణాఫ్రికా	7	6	1	+2.29	12
భారత్	6	6	0	+1.40	12
ఆస్ట్రేలియా	6	4	2	+0.97	8
న్యూజిలాండ్	7	4	3	+0.48	8
పాకిస్థాన్	7	3	4	-0.02	6
అఫ్గానిస్థాన్	6	3	3	-0.71	6
శ్రీలంక	6	2	4	-0.27	4
నెదర్లాండ్స్	6	2	4	-1.27	4
బంగ్లాదేశ్	7	1	6	-1.44	2
ఇంగ్లండ్	6	1	5	-1.65	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

ఢిల్లీ, ముంబై వేదికల్లో పటాకులపై నిషేధం

న్యూఢిల్లీ : ప్రపంచకప్ సందర్భంగా ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబైలలో జరిగే మ్యాచ్‌లలో బాణసంచా కాల్చడంపై నిషేధం విధిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఆ నగరాలలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు కార్యదర్శి జై షా వెల్లడించారు. ఢిల్లీ ఈ నెల 6న బంగ్లాదేశ్-శ్రీలంక మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుండగా, ముంబై 2, 7 తేదీలలో రెండు లీగ్ మ్యాచ్‌లు, 15న సెమీఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నది. ఢిల్లీలో వరుసగా అయిదో రోజు వాయు కాలుష్యం స్థాయి 372 ఎక్యుఐ(ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)పాయింట్లు ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. ముంబైలో కూడా కాలుష్యం తీవ్ర స్థాయిలో నెలకొనడంతో హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనితో తమవంతు బాధ్యతగా బాణసంచాపై నిషేధం విధించినట్టు బీసీసీఐ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

అఫ్రిదికి టాప్ ర్యాంక్

దుబాయ్ : పాకిస్థాన్ పేసర్ షాహీన్ షా అఫ్రిది వన్డే బౌలర్లలో టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అఫ్రిది ఏడు స్థానాలు మెరుగుపరుచుకుని అగ్రస్థానానికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన పోరులో మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన అఫ్రిది వన్డేలలో 100 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. అఫ్రిది 51 మ్యాచ్‌లలో ఈ మైలురాయి చేరుకుని అత్యంత వేగంగా ఈ ఘనతను సాధించిన వారిలో మూడో స్థానంలో నిలిచాడు. కాగా భారత బౌలర్లు మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్ ర్యాంకింగ్స్‌లో 3, 7 స్థానాలలో నిలిచారు. బ్యాటర్లలో బాబర్ అజమ్ టాప్‌లో కొనసాగుతుండగా, భారత బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2, 5, 7 స్థానాలలో నిలిచారు.

వాణిజ్య

రూ.1,100 పతనం

గత 3 రోజులుగా క్షీణిస్తున్న బంగారం ధరలు

హైదరాబాద్‌లో రూ.61,530 వద్ద రేటు



హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబర్ 1: బంగారం ధరలు క్షీణిస్తున్నాయి. వరుసగా మూడోరోజూ పతనం చెందగా.. ఈ మూడు రోజుల్లో తులం రేటు రూ.1,100 దిగొచ్చింది. బుధవారం హైదరాబాద్‌లో మరో రూ.320 పడిపోయి 10 గ్రాముల 24 క్యారెట్ పుత్తడి విలువ రూ.61,530కి తగ్గింది. సోమ, మంగళవారాల్లోనూ రూ.230, రూ.550 చొప్పున దిగిన విషయం తెలిసిందే. 22 క్యారెట్ రేటు కూడా ఈ మూడు రోజుల్లో రూ.1,010 దిగజారి తులం రూ.56,400 వద్ద ఉన్నది. బుధవారం ఒక్కరోజే రూ.300 పడింది. మరోవైపు ఢిల్లీలోనూ రూ.350 తగ్గి 10 గ్రాముల మేలిమి పసిడి రూ.61,700 పలికింది.

వెండికి లేని ఆదరణ

వెండి ధరలూ నేలచూపుల్నే చూస్తున్నాయి. బుధవారం కిలో రేటు ఏకంగా రూ.1,200 క్షీణించింది. దీంతో రూ.77,000 వద్దకు వచ్చింది. మంగళవారం రూ.300 పడిన సంగతి విదితమే. ఢిల్లీలో రూ.74,300లుగా ఉన్నది. కాగా, అమెరికా డాలర్, బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారుతున్నకొద్దీ పసిడి ధరలు పడిపోతున్నాయి. మదుపరులు తమ పెట్టుబడులను గోల్డ్ నుంచి మళ్లిస్తున్నట్టు నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్సు బంగారం 1,978 డాలర్లుగా, వెండి 22.55 డాలర్లుగా ఉన్నది.

జారిపోతున్న రూపాయి

ఇంట్రాడేలో ఆల్‌టైం కనిష్ఠం 83.35 వద్దకు కరెన్సీ

దెబ్బకొట్టిన ద్రవ్యలోటు, ఇన్‌ఫ్రా, పీఎంఐ డేటా

ముంబై, నవంబర్ 1: ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్య ప్రభావం రూపాయిపై తీవ్రంగా పడుతున్నది. ద్రవ్యోల్బణం అదుపు తప్పడం, ద్రవ్యలోటు విస్తృతంకావడం, ఎగుమతులు పడిపోవడం, వాణిజ్యలోటు అంతకంతకూ పెరిగిపోవడం, తయారీ, మౌలిక పరిశ్రమలు గాడితప్పడం, విదేశీయులు దేశీ మార్కెట్ నుంచి నిధులు తరలించుకుపోవడం వంటి అంశాలన్నీ కరెన్సీని కుదేలుచేస్తున్నాయి. కొద్ది రోజులుగా ఏ మాత్రం కోలుకుకుండా బలహీనంగా ట్రేడవుతున్న రూపాయి..వరుసగా బలహీన ఆర్థిక గణాంకాలు వెలువడటంతో బుధవారం ఒక్కసారిగా జారిపోయింది. బుధవారం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్) మార్కెట్లో డాలరు మారకంలో 83.26 వద్ద బలహీనంగా ప్రారంభమైన భారత్ కరెన్సీ క్రమేపీ క్షీణించి ఇంట్రాడేలో 83.35 వద్దకు పడిపోయింది. ప్రొవిజనల్‌గా ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయి 83.33 వద్ద ముగిసినప్పటికీ, తుది డాటా ప్రకారం క్రితం ట్రేడింగ్ రోజుతో పోలిస్తే 4 పైసలు క్షీణించి చరిత్రాత్మక కనిష్ఠస్థాయి 82.28 వద్ద నిలిచింది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న ముగింపు 83.32 ఇప్పటివరకూ రికార్డు కనిష్ఠస్థాయి.

ఇటీవల వెలువడిన దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు నిరుత్సాహంగా ఉండటం, ఎఫ్‌పీఐల అమ్మకాలు రూపాయిపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు గత ఏడాదితో పోలిస్తే 37 శాతం నుంచి 39 శాతానికి పెరగడం, ఆర్థిక వ్యవస్థకు కీలకమైన మౌలిక రంగాల వృద్ధి రేటు సెప్టెంబర్ నెలలో 8 శాతానికి పరిమితం కావడం ఆందోళనకర అంశాలేనని వారంటున్నారు. అలాగే భారత్‌లో తయారీ పరిశ్రమ సమీప భవిష్యత్తులో నీరసించబోతుందనడానికి సంకేతంగా ఎస్ అండ్ పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) అక్టోబర్‌లో 55.5 పాయింట్లకు దిగజారినట్టు తాజాగా వెలువడిన డేటా సైతం రూపాయికి షాక్ ఇచ్చిందని ఫారెక్స్ నిపుణులు వివరించారు. ఇది సెప్టెంబర్‌లో 57.5 పాయింట్లు ఉంది. బుధవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.1,816 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించినట్టు ఎక్స్ఛేంజీల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 283 పాయింట్లు క్షీణించి నాలుగు నెలల కనిష్ఠస్థాయి 63,591 పాయింట్ల వద్ద ముగిసింది.

ఆర్బీఐ మద్దతు వ్యర్థం

దేశీయ నిరుత్సాహకర ఆర్థికాంశాలకు తోడు అంతర్జాతీయ మార్కెట్లో అమెరికా డాలర్ బలపడటం, భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు అదేపనిగా నిధులు తరలించుకుపోవడం, మధ్యప్రాచ్య యుద్ధ ఉద్రిక్తతలు తదితర ప్రతికూల అంశాల నడుమ రిజర్వ్‌బ్యాంక్ ప్రభుత్వ బ్యాంకల సాయంతో డాలర్లను విక్రయించి, రూపాయికి మద్దతు ఇచ్చినప్పటికీ భారత్ కరెన్సీ నిలబడలేదని ఫారెక్స్ ట్రేడర్లు చెప్పారు. యూఎస్ కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ తాజా సమీక్షలో వడ్డీ రేట్ల నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో డాలర్ బలపడుతున్నదని, దీంతో భారత్‌తో సహా పలు వర్ధమాన దేశాల కరెన్సీలు తగ్గుతున్నాయని బీఎన్‌పీ పారిబా రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌధరి చెప్పారు. డాలర్ ఇండెక్స్ 10 నెలల గరిష్ఠస్థాయి 106.87 వద్ద ట్రేడవుతున్నది.

ICICI Bank

వడ్డీరేట్లను పెంచిన ఐసీఐసీఐ బ్యాంక్

న్యూఢిల్లీ, నవంబర్ 1: రుణ గ్రహీతలకు షాకిచ్చాయి రెండు బ్యాంక్‌లు. మార్జినల్ కాస్ట్ బేస్డ్ లెండింగ్ రేట్(ఎంసీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును ఐదు బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్టు ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియాలు తాజాగా ప్రకటించాయి. పెరిగిన రేట్లు బుధవారం నుంచే అమలులోకి వచ్చాయి కూడా. ఐసీఐసీఐ బ్యాంక్ వెబ్‌సైట్ సమాచారం మేరకు ఒక్కరోజు, నెల రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.50 శాతానికి, మూడు, ఆరు నెలల రుణాలపై వడ్డీరేటు వరుసగా 8.55 శాతంగాను, 8.90 శాతానికి పెంచాయి. ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై రేటును 9 శాతానికి సవరించింది. అలాగే బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తన ఎంసీఎల్ఆర్‌ని 5 బేసిస్ పాయింట్లు సవరించింది. దీంతో రుణ రేట్లు 7.95 శాతం నుంచి 8.95 శాతం మధ్యలోకి చేరుకున్నాయి.

ఎన్ఎండీసీ ఉత్పత్తి భేష్

హైదరాబాద్, నవంబర్ 1: ఇనుప ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్ఎండీసీ మరో రికార్డును సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 19.71 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే సమయంలో ఉత్పత్తిచేసిన దాంతో పోలిస్తే ఇది 19 శాతం అధికం. అలాగే అమ్మకాలు 23.40 శాతం పెరిగి 23.99 మిలియన్ టన్నులకు చేరింది. గత నెల విషయానికి వస్తే 3.92 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 3.44 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది.

ఎక్విప్ సీఈవోగా అమోల్ పాల్కర్

హైదరాబాద్, నవంబర్ 1: ఐటీ, ఐటీఈఎస్ సంస్థ ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ కొత్త సీఈవోగా అమోల్ పాల్కర్ నియమితులయ్యారు. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనలను పాటించడంలో భాగంగా ప్రమోటర్ల వాటాను 97 శాతం నుంచి 75 శాతానికి తగ్గించడానికి ఇటీవల ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో శక్తి హార్మాన్ సెంటర్

హైదరాబాద్, నవంబర్ 1: కమర్షియల్, ఇండస్ట్రీయల్, రెసిడెన్షియల్ తలుపులు తయారు చేస్తున్న శక్తి హార్మాన్..తాజాగా రిటైల్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. రిటైలర్లను ఆకట్టుకోవడానికి హైదరాబాద్‌తోపాటు ఢిల్లీల్లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ప్రారంభించింది. కస్టమర్లు టచ్ అండ్ ఫీల్ ఉండాలనే ఉద్దేశంతో ఈ సెంటర్లను ప్రారంభించినట్టు, కమర్షియల్‌తోపాటు రిటైల్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్టు కంపెనీ ఎండీ శశిదర్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని గాగిలాపూర్ వద్ద ఉన్న ప్లాంట్లో ప్రతియేటా 2 లక్షల డోర్లు, డోర్ ఫ్రేమ్లు, 10 వేల ఇండస్ట్రీయల్ డోర్ ఫ్రేమ్లు తయారవుతున్నాయి. ప్రస్తుతం 300 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. జైపూర్‌లో రూ.175 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న 1.30 లక్షల యూనిట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ వచ్చే ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నట్టు చెప్పారు. గడిచిన సంవత్సరంలో రూ.270 కోట్లుగా నమోదైన టర్నోవర్, ఈ ఏడాది రూ.320 కోట్లకు చేరుకుంటుందన్నారు.

జీఎస్టీ వసూళ్లు 1.72 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, నవంబర్ 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. పన్నుల ఎగవేతలు తగ్గుముఖం పట్టడం, పండుగ సీజన్ కూడా తోడవడంతో గత నెల రూ.1.72 లక్షల కోట్ల వస్తు, సేవల పన్ను వసూలైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో వసూలైన రూ.1.87 లక్షల కోట్ల తర్వాత ఇదే గరిష్ఠం. ఇక నిరుడు అక్టోబర్ పన్ను వసూళ్ళతో పోలిస్తే 13 శాతం పెరిగినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. సెప్టెంబర్‌లో 1.63 లక్షల కోట్ల మేర వసూలయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సరాసరిగా ఒక్కో నెలలో రూ.1.66 లక్షల కోట్ల స్థాయిలో వసూలైనట్టయింది. ఇదిలావుంటే గత నెల జరిగిన రూ. 1,72,003 కోట్ల వసూళ్లలో రూ. 30,062 కోట్లు సెంట్రల్ జీఎస్టీగా, రూ.38,171 కోట్లు స్టేట్ జీఎస్టీగా, రూ.91,315 కోట్లు ఇంటిగ్రేటెడ్ జీఎస్టీగా, రూ.12,456 కోట్లు సెస్ రూపంలో వచ్చాయి.

నరేశ్ గోయల్ 503 కోట్ల ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ, నవంబర్ 1: జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్, ఆయన కుటుంబ సభ్యులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాకిచ్చింది. లండన్, దుబాయ్, భారత్‌లో ఉన్న రూ.503 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. బ్యాంక్ రుణాలు ఎగ్గొట్టిన కేసులో మనీ ల్యాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ విచారణలో తేలింది. జప్తు చేసిన ఆస్తుల్లో 17 రెసిడెన్షియల్ ఫ్లాట్లు, భవంతులు, కమర్షియల్ స్థలాలున్నాయి. జెట్‌ఎయిర్ ప్రైవేట్ లిమిటెడ్, జెట్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, గోయల్, ఆయన భార్య, కుమారుడు, ఇతర ఫెడరల్ ఏజెన్సీల పేరిట ఉన్న ఆస్తులను జప్తు చేసింది.

తీరుమారని మార్కెట్లు

రెండోరోజూ నష్టాల్లోనే సూచీలు

సెన్సెక్స్ 284, నిఫ్టీ 90 పాయింట్లు డౌన్

ముంబై, నవంబర్ 1: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ వరుస నష్టాల బాట పట్టినట్టే కనిపిస్తున్నది. బుధవారం కూడా సూచీలు పడిపోయాయి. దీంతో రెండోరోజూ మార్కెట్లు నిరాశపర్చినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 283.60 పాయింట్లు లేదా 0.44 శాతం దిగజారి 63,591.33 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 63,550.46 స్థాయికి పతనం కావడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం 90.45 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 18,989.15 వద్ద స్థిరపడింది. కాగా, దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటుండటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీసినట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఎఫ్ఐఐలు రూ.1,816.91 కోట్లు వెనక్కి తీసుకున్నారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేటు నిర్ణయం కూడా ప్రభావితం చేస్తున్నట్టు చెప్తున్నారు.

మెటల్, పవర్ షేర్లు ఢమాల్

మెటల్ 1.45 శాతం, పవర్ 1.19 శాతం, కమోడిటీస్ 1.18 శాతం, సర్వీసెస్ 1.15 శాతం, యుటిలిటీస్ 1.13 శాతం, ఐటీ 0.75 శాతం, టెక్నాలజీ 0.63 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.59 శాతం చొప్పున పడిపోయాయి. ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, నెస్లే, మారుతీ తదితర షేర్లు నిరాశపర్చాయి. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.35 శాతం, స్మాల్‌క్యాప్ 0.10 శాతం నష్టపోయాయి. ప్రధాన ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా సూచీలు లాభపడగా, హాంకాంగ్ నష్టపోయింది. ఐరోపా